క్లుప్తంగా

ఆర్థిక సాయం అందజేత



మదనాపురం: మండల కేంద్రానికి చెందిన 1995–96 పదో తరగతి బ్యాచ్ స్నేహితుడు ఖాజాహుస్సేన్ కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో తోటి స్నేహితులు ఆదివారం రూ.72వేలు బాధిత కుటుంబానికి అందజేశారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్నేహితులు, తదితరులు పాల్గొన్నారు.

పుర కమిషనర్‌గా శశిధర్



ఆత్మకూర్: ఆత్మకూర్ మున్సిపాలిటీ కమిషనర్‌గా చికినే శశిధర్ ఆదివారం సాయంత్రం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ కమిషనర్ పని చేస్తున్న నాగరాజు కోస్గికి బదిలీపై వెళ్లారు. దీంతో కోస్గిలో విధులు నిర్వహిస్తున్న శశిధర్ ఆత్మకూర్‌కు వచ్చారు. ఈ సందర్భంగా పురపాలిక మండలి సభ్యులు, సిబ్బంది కమిషనర్‌కు పూలమాల, శాలువాతో స్వాగతం పలికారు.

ఉత్సాహంగా క్రికెట్ పోటీలు



శాంతినగర్: దసరా ఉత్సవాల్లో భాగంగా వడ్డేపల్లి మండలం తనగలలో చల్లా యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన టీపీఎల్ క్రికెట్ పోటీలు ఉత్సాహంగా కొనసాగాయి. మొదటి బహుమతి ఎస్ఎంఎస్ 11, ద్వితీయ బహుమతి కేఆర్‌బీ చాంపియన్ జట్లు కైవసం చేసుకున్నాయి. విజేతలకు చల్లా యూత్ ఆధ్వర్యంలో బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు విష్ణువర్ధన్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, రాజశేఖర్, అశోక్‌లు పాల్గొన్నారు.

ఆలయ ఈఓకు సత్కారం



అలంపూర్: దేవి శరన్న నవరాత్రి ఉత్సవాలను విజయవంతానికి కీలకపాత్ర పోషించిన ఆలయ ఈఓ, ప్రధాన అర్చకుడిని ఆర్యవైశ్య సంఘం నాయకులు ఘనంగా సత్కరించారు. అలంపూర్ పట్టణంలోని కన్యకాపరమేశ్వరి నిత్య అన్నదాన సత్రంలో శ్రీజోగులాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి వారి ఆలయ ఈఓ పురేందర్ కుమార్, ప్రధాన అర్చకులు డిండిగల్ ఆనంద్ శర్మను ఆర్యవైశ్య సంఘం అధ్వర్యంలో ఆదివారం సన్మానించారు. ఈఓ పురేందర్ కుమార్‌ను, ప్రధాన అర్చకుడు డిండిగల్ ఆనంద్ శర్మను ఆర్యవైశ్య సంఘం నాయులు శాలువాతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు వేణయ్య, ప్రధాన కార్యదర్శి చిలుకూరి రమేష్ గుప్త, కోశాధికారి వెంకట్రామయ్య శెట్టి, నాయకులు శ్రీధర్, చిలుకూరి సతీష్ కుమార్, నాగరాజు, గోపాలకృష్ణయ్య, వేముల కృష్ణమూర్తి, మేడా చంద్రశేఖర్, తిరుపాల్ శెట్టి తదితరులు ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి పోరాడుదాం



అయిజ: మున్సిపాలిటీలో సమస్యలు తిష్టవేశాయని, సమస్యల పరిష్కారం కోసం పోరాడుదామని అఖిలపక్షం కమిటీ అధ్యక్షుడు ఆంజనేయులు అన్నారు. ఆదివారం పట్టణంలో అఖిల పక్షం కమిటీ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యలపై ప్రజల నుంచి వినతిపత్రాలు వచ్చాయని తెలిపారు. ముఖ్యంగా పెద్ద వాగుపై నిర్మించిన బ్రిడ్జికి అప్రోచ్ రోడ్డు నిర్మాణం పూర్తి చేయించాలని, మేడికొండ రోడ్డుపై నిలిచిపోయిన బ్రిడ్జి పనులను పూర్తి చేయించాలని, పీహెచ్‌సీ వద్ద అసంపూర్తిగా నిలిచిపోయిన 30 పడకల ఆస్పత్రి భవన నిర్మాణం పనులను పూర్తిచేయించాలని వినతులు వచ్చినట్లు తెలిపారు. సమస్యలను పరిష్కారానికి నిరసన కార్యక్రమాలు చేపట్టాలని, అధికారులను, పాలకులను నిలదీయాలని కమిటీ సభ్యులను కోరారు. కార్యక్రమంలో మద్దిలేటి, విజయభాస్కర్ రెడ్డి, ఆంజనేయులు, తాహేర్, జగపతిరెడ్డి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



కొత్తకోటలో జమ్మిచెట్టుకు పూజలు చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పి.సుఖేశి, ప్రజాప్రతినిధులు



కొత్తకోటలో జమ్మిచెట్టు దగ్గరకు తరలివస్తున్న ప్రజలు, రాజకీయ నాయకులు.



పాన్‌గల్: శమివృక్షం వద్ద ప్రత్యేక పూజలు చేస్తున్న నాయకులు, గ్రామస్తులు



పాన్‌గల్ మండలం తెల్లరాళ్లపల్లితండాలో దసరా ఉత్సవాల్లో గిరిజనుల నృత్యాలు

వైభవంగా విజయదశమి వేడుకలు

- భక్తిశ్రద్ధలతో ఆలయాల్లో పూజలు
- పలు చోట్ల రావణాసుర వధ
- శమి వృక్షానికి ప్రత్యేక పూజలు
- ఘనంగా దుర్గామాత నిమజ్జనం



అమ్మవారిని నిమజ్జనానికి తరలిస్తున్న భక్తులు



ఆత్మకూర్‌లో దుర్గామాత ఊరేగింపులో అమ్మవారి వేషధారణలో చిన్నారులు



కేతేపల్లిలో శమివృక్షం పూజలో డీసీసీబీ చైర్మన్ మామిళ్ళపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి

సాక్షి, నెట్‌వర్క్: విజయ దశమి పండుగ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయాల్లో ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహించి, పిండి వంటలతో నైవేద్యం సమర్పించారు. పలు చోట్ల రావణాసుర వధ నిర్వహించారు. పలువురు వాహనాలను ముస్తాబు చేసి పూజలు నిర్వహించారు. దుకాణాల్లో, పరిశ్రమల్లో ఆయుధ పూజలు నిర్వహించారు. సాయంత్రం కుటుంబ సభ్యులతో శమి వృక్షానికి పూజలు నిర్వహించారు. తొమ్మిది రోజులు పూజలందుకున్న దుర్గామాతకు శోభాయాత్ర నిర్వహించి, అనంతరం నిమజ్జనం చేశారు.

కార్యక్రమంలో మున్సిపాల్ చైర్‌పర్సన్ పి.సుఖేశిని, జెడ్పీ మాజీ వైస్‌చైర్మన్ వామన్‌గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ పి.ప్రశాంత్, పి.కృష్ణారెడ్డి, బోయేజ్, గొల్లబాబు, చెన్నకేశవరెడ్డి, వైస్ చైర్‌పర్సన్ జయమ్మ, మాజీ ఎంపీపీ గుంత మౌనిక, మాజీ జెడ్పీటీసీ సభ్యులు పి.విశ్వేశ్వర్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, మార్కెట్‌యార్డు డైరెక్టర్లు ఉన్నారు.

■ పాన్‌గల్ మండలంలో డీసీసీబీ చైర్మన్ మామిళ్ళపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

■ ఆత్మకూర్‌లో అమ్మవారిని ఆదివారం రాత్రి ఊరేగింపు నిర్వహించి వీడ్కోలు పలికారు. అమ్మవారి విగ్రహాలను మేళతాలాలు భాజాభజంత్రీలు, బొడ్డెమ్మలతో, పలుకలకోళ్లు, చిన్నారుల కూచిపూడి నాట్యం, పోతురాజుల విన్యాసాలతో పట్టణ పురవీధుల గుండా ఊరేగించారు. శనివారం రాత్రి జాతర మైదానంలో చైర్‌పర్సన్ గాయత్రి షమిపూజ నిర్వహించారు. వేడుకలలో అమరచింత వాసి పంజాబ్, చండీగఢ్ రాష్ట్రాల బీజేపీ ఆర్గనైజింగ్ సెక్రటరీ మంత్రి శ్రీనివాసులు పాల్గొన్నారు.



చిట్యాలలో శమివృక్షానికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు



ఖిల్లాఘనపురంలో రావణాసుర దహనం చేస్తున్న గ్రామస్తులు



ఖిల్లాఘనపురం మండలం మామిడిమాడలో అమ్మవారి ఊరేగింపులో పాల్గొన్న భక్తులు



గోవర్ధనగిరిలో అమ్మవారి ఊరేగింపులో బతుకమ్మ ఆడుతున్న యువతులు, మహిళలు



అమరచింతలో దశమి కట్టకు వెళ్తున్న ప్రజలు



ఆత్మకూర్‌లో అమ్మవారిని ఊరేగిస్తున్న భక్తులు

భూలక్ష్మీవేంకటేశ్వరస్వామి కల్యాణం



భూలక్ష్మీవేంకటేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



పల్లకీ సేవలో పాల్గొన్న భక్తులు

కొత్తకోట రూరల్: కొత్తకోట సమీపంలోని వెంకటగిరి గుట్టపై ఉన్న ఆలయంలోని భూలక్ష్మీవేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. దసరా పండుగ పురస్కరించుకొని భూలక్ష్మీ వేంకటేశ్వరస్వామి దంపతులను అర్చకులు పట్టు వస్త్రాలతో అలంకరించారు. కల్యాణోత్సవాన్ని కనుల పండువగా చేశారు. భక్తులకు ఆలయ నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు అందజేయడంతో పాటు అన్నదానం చేశారు. కార్యక్రమంలో అర్చకులు సింగరా ఆచార్యులుతో పాటు ఆలయ నిర్వాహకులు, గొల్లబాబు, వేముల శ్రీనివాస్‌రెడ్డి, నరోత్తంరెడ్డి, శ్రీనివాసులుశెట్టి, కురుమూర్తిసాగర్, బాల్‌రెడ్డి, రాంబాబురెడ్డి, సతీష్‌కుమార్, భాస్కర్, వెంకట్‌రెడ్డి, శివశంకర్, భక్తులు తదితరులు ఉన్నారు.

ఉద్యోగాలు సాధించిన యువకులకు సన్మానం



సత్యహళ్లిలో యువకులను సన్మానిస్తున్న గ్రామస్తులు

కొత్తకోట రూరల్: మండలంలోని సత్యహళ్లి గ్రామానికి చెందిన కుమ్మరి మనోహర్ ఇటీవల డీఎస్సీలో ఉపాధ్యాయ ఉద్యోగం సాధించాడు. సుక్క భాను బెటాలియన్‌లో కానిస్టేబుల్‌గా ఉద్యోగం సాధించాడు. గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు ఉద్యోగాలు సాధించడంతో గ్రామస్తులు వారిని శాలువాలతో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పోతురాజు మహేష్, రాందాస్, జాజల తిరుపతయ్య, ఆర్టీసీ ఉద్యోగి సైదులు, పుల్లన్న, ప్రభాకర్, మురళీధర్, నాగరాజు, కృష్ణ, భరత్, వీరేందర్, భాను, సాయి ఉన్నారు.

వీధి కుక్కల స్వైరవిహారం

- పట్టించుకోని మున్సిపల్ అధికారులు
- భయాందోళనలో ప్రజలు



ఎనిమిదో వార్డులో గుంపులుగా తిరుగుతున్న వీధి కుక్కలు

అమరచింత: పట్టణంలోని పలు వార్డుల్లో వీధి కుక్కలు రోజు రోజుకు పెరిగి పోతున్నాయి. చిన్నారులతో పాటు యువకులపై దాడి చేసి గాయపరుస్తున్నా వాటిని పట్టణం నుంచి తరలించలేక పోతున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత నెలలో బీసీ కాలనీలో ఇంటి ముందు ఆడుకుంటున్న చిన్నారిపై కుక్కలు దాడి చేశాయి. దీంతో తీవ్రంగా గాయపడిన చిన్నారిని హైదరాబాద్‌కు తీసుకెళ్లి చికిత్స చేయించారు. పక్షం రోజుల క్రితం శ్రీకృష్ణ నగర్‌లో ఇద్దరు కుక్కకాటుకు గురయ్యారు. మటన్ మార్కెట్ పరిసరాల్లో కుక్కలు అధికంగా ఉండటంతో ఆటు వైపు ఒంటరిగా వెళ్లాలంటే భయపడే పరిస్థితులు దాపురించాయి. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి వీధి కుక్కలను నియంత్రించాలని ప్రజలు కోరుతున్నారు.

అంబేడ్కర్ జీవితం స్ఫూర్తిదాయకం

మహబూబ్‌నగర్ రూరల్: క్రిష్టియన్‌పల్లి శివారులోని మహామాయ గౌతమ బుద్ధ విహార్‌లో ధమ్మచక్ర పరివర్తన్ దివస్ కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడారు. ప్రపంచ మేధావి అంబేడ్కర్ అని అన్నారు. ఆయన జీవితం స్ఫూర్తిదాయకమని కొనియాడారు. శాంతి సమానత్వ సందేశాన్ని అందించిన బుద్ధుడి మార్గంలో ప్రతిఒక్కరూ నడవాలని అంబేడ్కర్ బౌద్ధ ధర్మాన్ని స్వీకరించారని గుర్తుచేశారు. నాయకులు ఆది లక్ష్మయ్య, బాలపీర్, సింగిరెడ్డి పరమేశ్వర్, రాయికంటి రాందాస్, వెంకటేష్, నరసింహ, డాక్టర్ ఆది చైతన్య, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ ప్రత్యేక పూజలు



కొత్తకోట రూరల్: పట్టణంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలోని వాసవిమాతకు రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయానికి వచ్చిన ఆయనకు ఆలయ నిర్వాహకులు, అర్చకులు కలిసి అమ్మవారి చిత్రపటాన్ని అందజేసి పూలమాల వేసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో విశ్వనాథం వెంకటరమణ, గుంత సురేష్, శ్రీనివాసులు శెట్టి, నరేష్ తదితరులు ఉన్నారు.

నీట్‌లో ర్యాంకు సాధించిన విద్యార్థికి సన్మానం



రాంపురంలో మెడిసిన్ విద్యార్థికి సన్మానం

వనపర్తి రూరల్: పెబ్బేరు మండలంలోని రాంపురం గ్రామానికి చెందిన ఆడెం వర్ష నీట్‌లో ర్యాంక్ సాధించి మెడిసిన్ సీటు సాధించడంతో ఆదివారం యాదవ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో శాలువాతో సన్మానించారు. ఆమె భవిష్యత్‌లో మంచి డాక్టర్‌గా పేదలకు సేవలు అందించాలని కోరారు. కార్యక్రమంలో మేకల వేణుయాదవ్, బత్తుల నరేష్, వసంతపురం రాజు, లక్ష్మయ్య, నాగరాజు, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

దసరా సందర్భంగా కోళ్ల పంపిణీ



నవాబుపేట: మండల కేంద్రంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నర్సింహచారీ దసరా పండుగను పురస్కరించుకుని పిండి వంటలకు సరుకులు ఉచితంగా పంపిణీ చేశారు. అదేవిధంగా ఆదివారం కోళ్లను సైతం ఉచితంగా అందించారు. దాదాపు వెయ్యి కోళ్లను, లిక్కర్‌ను సైతం అందించినట్లు తెలిసింది. ఈ సందర్భంగా నర్సింహచారిని పలువురు అభినందించారు.

పాఠశాలకు రూ.10 లక్షల ఆర్థిక సాయం

ప్రకటించిన ఎన్ఆర్ఐ సూదిని శ్రీహరిరెడ్డి



యాపర్ల జెడ్పీహెచ్ఎస్‌లో సూదిని శ్రీహరిరెడ్డిని సన్మానిస్తున్న పీఆర్‌టీయూ టీఎస్ నాయకులు

వనపర్తి రూరల్: పెబ్బేరు మండలంలోని యాపర్ల గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ సూదిని నరేందర్‌రెడ్డి కుమారుడు సూదిని శ్రీహరిరెడ్డి కెనడా, అమెరికాలో స్థిరపడ్డాడు. ఆయన దసరా పండుగకు గ్రామానికి రావడంతో తోటి స్నేహితులతో కలిసి తాము చదువుకున్న ఉన్నత పాఠశాలను సందర్శించారు. వారం క్రితం అతను ఇచ్చిన రూ.3 లక్షలతో హైస్కూల్‌లో చేపట్టిన అభివృద్ధి పనులు పరిశీలించి సంతృప్తి చెందినట్లు శ్రీహరిరెడ్డి తెలిపారు. రెండు పాఠశాలలకు సంబంధించిన అభివృద్ధి పనులు, సామగ్రి కొనుగోలు దశల వారీగా కొనసాగించాలని ఎచ్ఎంను కోరారు. శనివారం ఎచ్ఎం పీ.శంకర్‌గౌడ్ ఆధ్వర్యంలో పాఠశాలల్లో ఏర్పాటు సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దాదాపు నలభై అయిదు ఏళ్ల కిందట తమ గ్రామంలో నిర్మించిన పాఠశాల శిథిలావస్థకు చేరడం చాలా బాధను కలిగించిందన్నారు. ఈ పాఠశాల పూర్వ విద్యార్థిగా అభివృద్ధికి రూ.10 లక్షల ఆర్థిక సాయం అందిస్తానని ప్రకటించారు. ఈ విద్యా సంవత్సరం పది, ఏడో తరగతిలో మొదటి ర్యాంక్ సాధించిన విద్యార్థులకు గోల్డ్ కాయిన్స్ అందిస్తానని తెలిపారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన గ్రంథాలయ గదిని వారి తండ్రి మాజీ ఎంపీటీసీ నరేందర్‌రెడ్డి ప్రారంభించారు. గ్రామంలోని దాతలు సూగూరు సత్యనారాయణ స్టడీచైర్లు, ముంత శ్రీనివాస్‌యాదవ్ విద్యార్థులకు రెండు జతల యూనిఫాం, విజకుమార్ రూ.10వేలు, డా.యాదగిరి రూ.5 వేలు, గంథాలయ పుస్తకాలు అందజేశారు. వినాయక యువజన సంఘం రూ.15 వేలు పాఠశాల కోసం ప్రకటించారు. ఈ సందర్భంగా వారిని ఎచ్ఎం శంకర్‌గౌడ్, గ్రామస్తులు, పీఆర్‌టీయూ టీఎస్ నాయకులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో గ్రామస్తులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

భవాని అమ్మవారికి వెండి త్రిశూలం బహూకరణ



కొత్తకోటలో అమ్మవారికి వెండి త్రిశూలం అందజేస్తున్న భవాని, రషీద్ దంపతులు

కొత్తకోట రూరల్: పట్టణంలోని అంబ భవాని ఆలయంలో భవానీ మాతకు పట్టణానికి చెందిన భవానీ, రషీద్ దంపతులు రెండు కిలోల (రూ.2లక్షల విలువైన) వెండి త్రిశూలం ఆలయ అర్చకునికి అందజేశారు. భవాని, రషీద్ దంపతులు కొన్నేళ్లుగా ఆలయంలో పని చేస్తున్నారు. ఆలయంలో పని చేస్తూ వచ్చిన వేతనంతో అమ్మవారికి వెండి త్రిశూలం అందజేసినట్లు వారు తెలిపారు. అమ్మవారికి వెండి త్రిశూలం బహూకరించిన దంపతులను ఆలయ నిర్వాహకులు, పలువురు అభినందించారు.

నిధులు మంజూరు చేయించండి

అయిజ: దేవాలయం అభివృద్ధికి నిధులు మంజూరు చేయించాలని ఆలయ కమిటీ సభ్యులు మాజీ ఎమ్మెల్యే బక్కని నరసింహులును కోరారు. దసరా పండుగ సందర్భంగా బక్కని నరసింహులు శనివారం మండలంలోని కట్టకింది తిమ్మప్ప స్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించి, ప్రత్యేక పూజలు చేయించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడారు. అప్పటి ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 2012లో కట్టకింది తిమ్మప్ప ఆలయంలో ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని హామీఇచ్చారని, గతంలో టీటీడీ నుంచి రూ. 35 లక్షలు మంజూరు చేయించారని, ఇంకా రూ.50 లక్షల మంజూరు చేయించాల్సి ఉందని తెలిపారు. వెంటనే మిగిలిన నిధులు మంజూరు చేయించాలని కోరారు. స్పందించిన బక్కని నరసింహులు నిధులు సమకూర్చేలా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు నరసింహులు, శ్రీను, వెంకటేష్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, టీడీపీ నాయకుడు సుధాకర్ గౌడ్, వివిధ పార్టీల, సంఘాల నాయకులు పాల్గొన్నారు.